సాక్షి బాపట్ల
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మాచర్ల : మాచర్ల ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. హోమం చేశారు.



వైభవంగా పౌర్ణమి పూజలు

రేపల్లెరూరల్: శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యన్నదానానికి తెనాలిలోని చినరావూరు చెందిన జిట్టా విజయలక్ష్మి సోమవారం రూ.1,00,001 విరాళం ఇచ్చారు.

న్యూస్‌రీల్

జిల్లా కలెక్టర్‌కు రక్షాబంధనం



చినగంజాం: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సోపిరాల గ్రామ మహిళలు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి సోమవారం రాఖీ కట్టారు. యూనియన్ బ్యాంక్ చినగంజాం శాఖ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా కలెక్టర్‌కు గ్రామ మహిళలు రాఖీ కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

వృక్షా బంధన్



అద్దంకి రూరల్: రాఖీ పండగ సందర్భంగా స్థానిక కేఆర్కే డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఎకో క్లబ్, ఇన్‌క్లూజివ్ సెంటర్ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో చెట్లకు విద్యార్థులు, అధ్యాపకులు రాఖీలు కట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ చెట్లను కూడా తోబుట్టువుల్లా భావించి రక్షించి కాపాడుకోవాలని సూచించారు. అధ్యాపకులు రాజశేఖర్, ఎస్‌కె మస్తాన్ వలి, వి.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్‌కు ముఖేష్ ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : పెరూ దేశంలోని లిమాలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరగనున్న జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌కు గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ ఎంపికయ్యాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ ఎస్.సుబ్రమణ్యేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. ముఖేష్ సుదీర్ఘ కాలంగా ఇండియన్ రైఫిల్ షూటింగ్ క్యాంప్‌లో కొనసాగుతున్నాడన్నారు. స్థిరమైన ఆటతీరుతో పలు రాష్ట్ర, జాతీయ పతకాలు సాధించాడని వెల్లడించారు.

సర్వర్ సమస్యతో పరుగో పరుగు



ప్రత్తిపాడు: సర్వర్ సమస్య అధికారుల్ని పక్క మండలాలకు పరుగులు పెట్టించింది. సోమవారం ఉదయం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, అనుబంధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ఆయా శాఖల అధికారులంతా కచ్చితంగా హాజరుకావాలని సూచించారు. దీంతో ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే సర్వర్ కనెక్ట్ కాకపోవడంతో సుమారు అరగంట గంటపాటు వేచి చూసిన అధికారులు ఇక లాభం లేదనుకుని వట్టిచెరుకూరు, గుంటూరు, పెదనందిపాడు మండలాలకు పరుగులు పెట్టారు. తీరా ఆఖరి పది నిమిషాల్లో ప్రత్తిపాడులో సర్వర్ కనెక్ట్ అవ్వడంతో ఉన్న పది మంది పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు వీడియో సమావేశాన్ని వీక్షించారు.

ఎండకు ఎర్రబడుతున్న వరి



తెనాలి: వేసవిని తలపిస్తున్న ఎండలతో వరి పొలాలు ఎర్రబడుతున్నాయి. ముఖ్యంగా చౌడు భూముల్లో ఎండ తీవ్రతకు నీరు ఆవిరైపోతోంది. నేలలోని లవణాలు పై పొరల్లో చేరడం వల్ల వరి మొక్కలు తేమను కోల్పోయి, ఆకులు ఎర్రబడుతున్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి సోమవారం మండల గ్రామాల్లో పర్యటించారు. వరి పైరును పరిశీలించారు. గుంటూరు జిల్లాలో దాదాపు 90 వేల ఎకరాల్లో వరిని వెదపద్ధతిలో సాగుచేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం 40–45 రోజుల దశలో ఉన్న పైరు అక్కడక్కడా ఎర్రబడిందని తెలిపారు. ముఖ్యంగా చౌడు భూముల్లోనే గమనించామని, వాటిల్లో నీరు తప్పనిసరిగా నిల్వకట్టి ఉంచాలని సలహానిచ్చారు. ఆకులు తెల్లబడినట్టయితే అన్నభేది లీటరు నీటికి 20 గ్రాములు, 20 గ్రాముల నిమ్మ ఉప్పును కలుపుకుని పిచికారీ చేయాలని సూచించారు.

షేర్ వల.. పేదలు విలవిల

- షేర్ మార్కెట్ నంబర్ల ఆధారంగా వినూత్న దోపిడీ
- పేదల రక్తాన్ని పిండుతున్న ఏజెంట్లు
- చీరాల నియోజకవర్గవ్యాప్తంగా జోరుగా సాగుతున్న వైనం
- పట్టించుకోని పోలీసులు



చీరాల: మోసాలలో షేర్ మార్కెట్ మోసాలు వేరయా అన్న చందంగా తయారైంది. జూదం, క్రికెట్ బెట్టింగ్, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ తదితర మోసాల గురించి విన్నాం. కానీ నంబర్లతో కొత్త జూదం మీరెప్పుడైనా విన్నారా.. అయితే ఇది చదవండి... షేర్ మార్కెట్ ఆధారంగా నడిచే జూదం మోసగాళ్ల సరికొత్త ఆయుధంగా కనిపిస్తోంది. సెన్సెక్స్‌లో చివరి అంకె, నిఫ్టీలో చివరి అంకెను కలిపి ఒక సంఖ్యగా లెక్కిస్తున్నారు. ఈ రెండు సంఖ్యలు కలిపి లెక్కించగా 90 వస్తే బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి 60 రెట్లు అధికంగా డబ్బులు చెల్లిస్తామని ఆశ పెట్టి పేదల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారు. షేర్ మార్కెట్ ఆధారంగా నిర్వహించే ఈ జూదాన్ని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. ఈ ఆట ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా జరుగుతోంది.

రోజువారీ కూలీలే టార్గెట్

చీరాల నియోజకవర్గంలో చేనేతలు, పేదలు, వ్యవసాయ, రోజువారీ కూలీలు అధికం. చీరాల మండలంలోని దేవినూతల నుంచి వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి గ్రామం వరకు ఎక్కువ భాగం నివశించేది పేదలే. కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే. ఈ గ్రామ పంచాయతీలతో పాటుగా మున్సిపాలిటీలోని వార్డుల్లో షేర్ మార్కెట్ దోపిడీ నడుస్తుంది. బేల్దారీ పనులు చేసుకునే వారు, చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు, కూరగాయలు అమ్ముకునే వారు, ఆటో డ్రైవర్లు, పెయింట్ పనికి వెళ్లే దినసరి కూలీలే టార్గెట్‌గా ఈ దోపిడీ జరుగుతోంది.

లక్షలు గడిస్తున్న బుకీలు..

మాయా జూదంతో పేదలు అప్పుల పాలవుతుండగా బుకీలు, ఏజెంట్లు మాత్రం రూ.లక్షలు గడిస్తున్నారు. రూ.100 పెట్టుబడి పెడితే రూ. 5 వేలు వస్తాయనే ఆశలు కల్పించి పేదలు ఈ ఆటల వైపు మొగ్గు చూపేలా గ్రామాలు, వార్డుల్లో ఏజెంట్ల ద్వారా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం ఏజెంట్ల ద్వారా ఈ జూదంలో పెట్టుబడి పెట్టించి సాయంత్రానికి సెన్సెక్స్‌లో వచ్చే షేర్ మార్కెట్ ఫలితాల ప్రకటన అనంతరం ఆఖరి నంబర్లు ఆధారంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. షేర్ మార్కెట్ జరిగే ప్రతి రోజూ ఈ జూదం జోరుగా జరుతుంది. సెలవు రోజుల్లో మాత్రం జూదగాళ్లు జొసీ అనే ఆటలు ఆడుతున్నారు. ఈ షేర్ మార్కెట్ జూదంలో పెట్టుబడి పెట్టే వారికి అసలు ఈ జూదంలో విజేతగా ఎలా నిర్ణయిస్తారో కనీసం అవగాహన లేకపోవడంతో ఏజెంట్ల మాయమాటలతో ఆర్థికంగా చితికిపోతున్నారు.

నెలకు రూ.5 కోట్లకు పైనే దోపిడీ..

ఈ జూదంలో డబ్బులు కట్టే వ్యక్తి సాయంత్రం షేర్ మార్కెట్‌లో ఆఖరున ఫలానా నంబర్ వస్తుందని బెట్టింగ్ కడుతాడు. ఇందుకు ముందుగానే ఏజెంట్‌కు డబ్బులు చెల్లించి ఒక పేపర్ తీసుకుంటాడు. ఒకవేళ తాను కట్టిన నెంబర్ (అరుదుగా వస్తుంది) షేర్ మార్కెట్ ఆఖరున వస్తే డబ్బులు చెల్లిస్తారు ఏజెంట్లు. లేకపోతే కట్టిన డబ్బులు హుష్. చీరాల నియోజకవర్గంలో షేర్ దోపిడీ ఎక్కువగా జరుగుతున్నా పోలీసులు కట్టడి చేయలేకపోతున్నారే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో నెలకు రూ.5 కోట్లకు పైనే దోపిడీ జరుగుతుందని సమాచారం. పెద్ద ఎత్తున ఏజెంట్లు పేదల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు.

సూత్రధారులెవరు ?

ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ పెద్ద మొత్తంలో షేర్ జూదం జరుగుతున్నా పోలీసులు కనిపెట్టలేకపోతున్నారంటే ఏవో కారణాలు ఉండవచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి. నెలకు రూ.5 కోట్లకు పైగానే జూదం జరుగుతున్నప్పటికీ సూత్రధారులను గుర్తించలేకపోతున్నారంటే ఆ రహస్యం తేల్చాల్సి ఉంది. విస్తతంగా ఏజెంట్లు, రోజూ నగదు మార్పిడి, పేదల నుంచి డబ్బుల వసూళ్లు చేస్తుంది ఎవరు ? ఎవరికి చెల్లిస్తున్నారు ? ఎంత కమీషన్లు వసూళ్లు చేస్తున్నారు ? ఎవరెవరికి ఇస్తున్నారో ? పోలీసులు విచారణ చేస్తేనే బహిరంగం అవుతాయి.

పోతే రూ.500 వస్తే రూ.30వేలు..!

ఫలానా వ్యక్తికి ఈ జూదంలో 500 పెట్టుబడిపెడితే రూ.30 వేలు వచ్చాయని జోరుగా ప్రచారాలు చేసుకుని రోజుకు రూ.లక్షల్లో షేర్ దోపిడీ చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ముఖ్యంగా ఈపురుపాలెం, తోటవారిపాలెం, 300 కాలనీ, జాంధ్రపేట, పేరాల, వేటపాలెం తదితర చేనేతలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ జూదం నడుస్తోంది. పోతే రూ.500 వస్తే రూ. 30 వేలు అనే భావనతో ఎక్కువమంది పేదలు ఈ జూదంలో డబ్బులు కట్టి అప్పుల పాలవుతున్నారు.

రాఖీ కట్టి వస్తూ అనంతలోకాలకు...

- బైక్‌ను కారు ఢీకొని 12 ఏళ్ల బాలిక మృతి
- తండ్రి, తల్లి, అక్కకు తీవ్రగాయాలు
- వేటపాలెం బైపాస్ రాజీవ్ స్వగృహ వద్ద ఘటన



నందిని మృతదేహం వద్ద పోలీసులు

వేటపాలెం: రాఖీ పండుగ రోజు విషాదం చోటుచేసుకుంది. సోదరులకు రాఖీ కట్టామన్న ఆనందం కాసేపైనా నిలవకుండా మృత్యువు ప్రమాద రూపంలో కబళించింది.. తల్లిదండ్రులను మృత్యువుతో పోరాడేలా చేసింది. ఈ ఘటన వేటపాలెం బైపాస్ రోడ్డులో రాజీవ్ స్వగృహ దగ్గరలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చినగంజాం మండలం అడవీధిపాలెంలో రొయ్యల చెరువు వద్ద కాపలా ఉండే టి.వెంకటేశ్వరరెడ్డి, భార్య లలిత, పెద్ద కుమార్తె రేణుకాదేవి, చిన్న కుమార్తె నందిని(12) కలసి అందరూ ఒకే బైక్‌పై చీరాల ఓడరేవులోని తమ బంధువుల ఇళ్లకు వెళ్లారు. అక్కడ సోదరులకు రేణుకాదేవి, నందిని లు రాఖీపౌర్ణమి సందర్భంగా రాఖీలు కట్టగా, అందరూ తిరుగు ప్రయాణమయ్యారు. వీరి బైక్ బైపాస్ రోడ్డులో రాజీవ్ స్వగృహ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా ఒంగోలు నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న నలుగురు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. వీరిలో చిన్న కుమార్తె నందిని (12) తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందగా ఆమె తండ్రి, తల్లి, అక్కలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. తల్లిదండ్రుల పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద దృశ్యం

మానవత్వానికే మాయని మచ్చ



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

బాపట్ల: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు ధ్వజమెత్తారు. సోమ వారం బాపట్ల పట్టణంలోని పలు కళాశాల విద్యార్థులు పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించి స్థానిక పాత బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. వైద్యులకే రక్షణ లేకపోతే రోగులను ఏవిధంగా కాపాడతారని ధ్వజమెత్తారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు మనోజ్ మాట్లాడుతూ పని చేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కృష్ణమోహన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రుణ సంస్థల వేధింపులు

- రుణం తీసుకున్న వ్యక్తి కట్టడంలేదని ఇతరులకు ఫోన్‌చేసి వేధిస్తున్న ఉద్యోగులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

చీరాల రూరల్: ఆన్‌లైన్ రుణాలకు సంబంధించిన మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రుణం తీసుకున్న వ్యక్తిని కాకుండా వేరే వ్యక్తికి ఓ ప్రైవేటు రుణ సంస్థ సిబ్బంది ఫోన్‌చేసి, నామినీగా మీ పేరుందని, మీరే రుణం కట్టాలంటూ వాదనకు దిగారు. రుణం తీసుకున్న వ్యక్తి పేరుకూడా తనకు తెలియదని, ఎవరో తన పేరు, ఫోన్ నంబరు ఇస్తే తానెలా బాధ్యుడనని చెబుతున్నా వినకుండా వేధింపులకు దిగడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

వివరాల్లోకి వెళితే.. వేటపాలెంకు చెందిన న్యాయవాది ముమ్మడి బాలరాజు చీరాల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తుంటాడు. ఆదివారం బెంగళూరుకు చెందిన క్యాసినో ఆన్‌లైన్ రుణ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ మహిళా ఉద్యోగి బాలరాజుకు ఫోన్‌చేసింది. ఈ నంబర్ నీదే కదా, నీపేరు బాలరాజే కదా అంటూ వివరాలు అడిగింది. న్యాయవాది ఆ వివరాలన్నీ తనవే అంటూ బదులిచ్చాడు. మీ ప్రాంతానికి చెందిన పృథ్వీ భానుప్రకాష్ అనే వ్యక్తి మా సంస్థ నుంచి ఆన్‌లైన్ రుణం పొందాడని, అయితే అతడు తీసుకున్న రుణాన్ని సక్రమంగా కట్టడం లేదని తెలిపింది. భానుప్రకాష్‌కు నామినీగా మీ ఫోన్ నంబర్‌తో పాటు మీ అడ్రస్ ఉందని చెప్పిడంతో బాలరాజు నిర్ఘాంతపోయాడు. ఎవరో నాకు తెలియని వ్యక్తి ఆన్‌లైన్‌లో రుణం తీసుకుని నా ఫోన్ నంబర్, నా వివరాలను నాకు తెలియకుండా ఎలా ఇస్తారని బాలరాజు నిలదీశాడు. ఆన్‌లైన్ రుణంతో నాకు ఎటువంటి సంబంధం లేదని మీరు నాకు ఫోన్ చేయవద్దంటూ ఆమెకు బదులిచ్చాడు. మీరు నాకు ఫోన్‌చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆమెతో చెప్పాడు. దీంతో ఆమె పోలీసులకు ఫోన్‌చేస్తే మాకు వచ్చిన భయమేంటేదని, నీ ఫోన్ నంబర్, వివరాలు మా వద్ద ఉన్నాయి కాబట్టే ఫోన్ చేశామంటూ బదులిచ్చింది. అయితే న్యాయవాది బాలరాజు వేటపాలెం ఎస్‌ఐకు సదరు కాల్‌ను కాన్ఫరెన్స్ కలపడంతో ఎస్‌ఐ బిజీగా ఉన్నాడని ఓ కానిస్టేబుల్ మాట్లాడారు. అయినప్పటికీ ఆ మహిళ ఏ మాత్రం తగ్గకుండా మా వద్ద బాలరాజు ఫోన్ నంబర్ ఉంది కనుక మాట్లాడుతున్నాం. మేమే అతని మీద కేసు నమోదు చేయిస్తామంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడింది. అంతేకాకుండా న్యాయవాది అకౌంట్లో డబ్బులు ఉంటే తీసుకుంటామని ఆమె దబాయించడంతో. కానిస్టేబుల్ చేసేదేమిలేక పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని న్యాయవాది బాలరాజుకు సూచించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వేటపాలెంలోని న్యాయవాది బాలరాజుకే కాక అదే ప్రాంతంలోని మరో ఇద్దరికి కూడా శని, ఆదివారాల్లో ఇటువంటి ఫోన్‌కాల్స్ వచ్చినట్లు సమాచారం.

అర్జీలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతుల స్వీకరణ



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: బాధితుల నుంచి వచ్చిన అర్జీలు సత్వరమే నాణ్యతతో పరిష్కరించి మేలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరై అర్జీలు అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. మొత్తంగా 91అర్జీలు.. రెవెన్యూ సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, పోలీస్, సీపీడీసీఎల్, మార్కెటింగ్, పురపాలక శాఖ, నీటిపారుదల, గృహ నిర్మాణ, చేనేత, దేవదాయ, పంచాయతీరాజ్, స్కూల్ ఎడ్యుకేషన్ మొదలగు శాఖలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే కలెక్టర్ పరిష్కారం చూపారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సొసైటీ అక్రమాల్లో నష్టపోయిన వారిని ఆదుకోవాలి



వేటపాలెం కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో జరిగిన అక్రమాలపై చేపట్టిన విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి. సొసైటీ కార్యదర్శితోపాటు మరికొంతమంది చేసిన అక్రమాలతో రూ.23కోట్లు వరకు ఖాతాదారులు నష్టపోయారు. బాధితులను ఆదుకోవాలి.

–శ్రీనివాసరావు, వీరబ్రహ్మం

గోడ కూల్చి ఇబ్బంది పెడుతున్నారు



కొంతమంది కావాలనే మా ఇంటి గోడ కూల్చి ఇబ్బంది పెడుతున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. ఎన్నిసార్లు తిరిగినా వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మా ఇంటి గోడ కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి.

–అమీనాబీ, వృద్ధురాలు, నరసాయపాలెం

ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులు దోహదం

యూనియన్ బ్యాంకు ప్రాంతీయ శాఖ ప్రారంభించిన కలెక్టర్ వెంకట మురళి



బ్యాంకు ప్రాంతీయ శాఖ కార్యాలయం ప్రారంభించి, శిలాఫలకం ఆవిష్కరించిన కలెక్టర్

చినగంజాం: గ్రామాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు దోహదం చేస్తాయని.. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకొని సర్వతోముఖాభివృద్ధి సాధించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. చినగంజాం మండలం సోపిరాల గ్రామంలో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చినగంజాం శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామస్తులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ టి.సీతారామాంజనేయులు, విశ్రాంత విద్యుత్ శాఖ ఈఈ కుర్రి రామసుబ్బారావు, టి.సీతయ్యలు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం బ్యాంక్ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ కొత్త శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలను అందించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. బ్యాంకు ఒంగోలు రీజినల్ హెడ్ వి.రవికుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. సభలో టి.సీతారామాంజనేయులు, కె.రామసుబ్బారావు, జి.రామాంజనేయులు, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ లక్ష్మణాచారి, టి.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎల్‌బీసీ కన్వీనర్, జనరల్ మేనేజర్ సీవీఎస్ భాస్కరరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ హెడ్‌లు బి.శ్రీనివాసరావు, కె.రామలింగేశ్వరరావు, చినగంజాం బ్రాంచ్ మేనేజర్ వి.ప్రదీప్‌చంద్రతో పాటు చీరాల, ఉప్పుగుండూరు, జాంధ్రపేట, గవినివారిపాలెం బ్యాంక్ మేనేజర్‌లు, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ కె.స్వరూపరాణి, బ్యాంక్ ప్రతినిధులు సాయని సాంబశివరావు, శ్రీనివాసరావు, సర్పంచ్ రాయని ఆత్మారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యార్డుకు 36,162 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 36,162 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,928 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ. 4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,098 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



మళ్లీ.. మళ్లీ ప్రారంభోత్సవం!

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.40లక్షలతో నిర్మించిన కొల్లూరు సచివాలయం -2 భవనం
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతంలోనే ప్రారంభించిన అధికారులు
- రెండోసారి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన వేమూరు ఎమ్మెల్యే
- అధికార పార్టీ నేతల వాలకం చూసి నవ్విపోతున్న జనం



కొల్లూరు సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

కొల్లూరు: ప్రభుత్వ యంత్రాంగం చేతుల మీదుగా ఇదివరకే ప్రారంభించిన ప్రభుత్వ భవనాన్ని అధికార పార్టీ నేతలు పునఃప్రారంభించడంపై మండల ప్రజల ముక్కున వేలేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. కొల్లూరు సచివాలయం–2 భవన నిర్మాణ పనులు సార్వత్రిక ఎన్నికల కోడ్ ప్రకటించడానికి ముందుగానే తుది దశకు చేరుకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టిన భవనం పనులు చివరి దశకు చేరుకోవడంతో గత ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులే నూతన భవనం ప్రారంభించాల్సి ఉంది. అయితే ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా జరగాల్సిన ప్రారంభోత్సవ కార్యక్రమం నిలిచిపోయింది. అయితే అదే సమయంలోనే పంచాయతీ, సచివాలయ అధికారులు భవన ప్రారంభోత్సవం జరిపించారు. తొలిరోజు విధులను సైతం ఆ భవనంలోనే నిర్వహించారు. అయితే అప్పట్నుంచి నూతన సచివాలయ భవనాన్ని వినియోగించకుండా ఉంచిన అధికారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తిరిగి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా సోమవారం రెండోసారి ప్రారంభింపజేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి, ప్రారంభోత్సవం జరుపుకొన్న సచివాలయ భవనాన్ని వాస్తవాలను కప్పిపెట్టి, తామే నిర్మించినట్లు రెండో సారి ప్రారంభించడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

స్థలం వివాదంలో పాస్టర్‌పై దాడి

- ఇల్లు ధ్వంసం.. అడ్డువచ్చిన భార్యపైనా దాడి
- ఫిర్యాదు చేసిన బాధితుడు
- కేసు నమోదులో పోలీసుల జాప్యం


చికిత్స పొందుతున్న పాస్టర్ జయరాజు

కొల్లూరు: స్థలం విషయంలో ఓ పాస్టర్‌పై దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని దోనేపూడికి చెందిన మోక జయరాజు 2012లో దోనేపూడిలో పల్లెకొండ కుమారి అనే మహిళ వద్ద 7 సెంట్లు ఇంటి స్థలం కొనుగోలు చేశాడు. ఆ స్థలంలోనే చర్చి నిర్మించుకొని ప్రార్థనలు చేస్తూ భార్య, పిల్లలతో కలసి జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆ స్థలాన్ని ఆనుకొని హార్వెస్ట్ ఇండియా మినిస్ట్రీస్ డైరెక్టర్ కత్తెర సురేష్‌కు సైతం స్థలం ఉండటంతో జయరాజుకు చెందిన స్థలాన్ని తమకు అప్పగించాలని వారు ఒత్తిడి తీసుకొస్తున్నారు. గత నెల 28న జయరాజు ఇంటి వద్ద లేని సమయంలో కత్తెర సురేష్, తెనాలికి చెందిన సుద్దపల్లి నాగరాజు, ఇమ్మడి నిరీక్షణ జ్యోతి అనే ముగ్గురు వ్యక్తులు వెళ్లి ఆ స్థలం తమదని నెలాఖరులోపు అప్పగించకపోతే మీ అంతుచూస్తామని బెదిరింపులకు పాల్పడటంతోపాటు, అసభ్య పదజాలంతో పాస్టర్ భార్య ఉషారాణిని దూషించారు. బెదిరింపుల విషయం తెలుసుకున్న పాస్టర్ జయరాజు కోర్టుని ఆశ్రయించడంతో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ మంజూరు చేసింది. అయితే ఈనెల 16న స్థలం విషయమై కత్తెర సురేష్ చర్చించమాన్నారంటూ సుద్దపల్లి నాగరాజు అనే వ్యక్తి ఫోన్‌చేసి సాయంత్రం అందుబాటులో ఉండాలని సూచించాడు. దీనిపై బాధితుడు జయరాజు తమకు స్థలం విక్రయించిన మహిళ భర్త ప్రకాష్‌ను సైతం తీసుకురావాలని కోరడంతో ప్రకాష్‌తోపాటు నాగరాజు అనే వ్యక్తి మరి కొంతమందిని తీసుకొని వెళ్లాడు. స్థలం విషయమై చర్చలు జరుగుతున్న సమయంలో రూ. 3 లక్షలు తీసుకొని స్థలం ఖాళీ చేసి వెళ్లాలని డిమాండ్‌కి దిగారు. ఈక్రమంలో తనకు ఆ స్థలమే ఆధారమని వాపోయిన బాధితుడు, మీకున్న స్థలం ధర ఎంతో చెబితే తానే ఆ నగదు చెల్లిస్తానని అనడంతో నాగరాజు అసభ్య పదజాలతో దూషిస్తూ బిషప్ కత్తెర సురేష్ మీదే కేసులు పెడతావా అంటూ దాడికి దిగాడు. అందుబాటులో ఉన్న వస్తువుతో కుడి చెవిపై కొట్టడంతో పాస్టర్‌కు తీవ్ర గాయమైంది. ఇంతలో దాడిని గమనించిన బాధితుడి భార్య కేకలు వేస్తూ అడ్డురావడంతో ఆమె జుట్టుపట్టుకొని లాగి చెంపలు, నడుముపై దాడి చేయడంతో పాటు, దాడి ఘటనను వీడియో చిత్రీకరిస్తున్న ఆమె ఫోన్‌ను పగలగొట్టారు. ఇంతలో నాగరాజుతోపాటు వచ్చిన కారు డ్రైవర్ కారులోంచి ఇనుప రాడ్డు తీసుకుని ఇంట్లో ఉన్న కుర్చీలు, ఇంటి రేకులు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితులపై జరుగుతున్న దాడిని మధ్యవర్తిగా మాట్లాడటానికి వచ్చిన ప్రకాశ్ అడ్డుకొని దాడికి పాల్పడుతున్న వ్యక్తులను వారించి అక్కడ నుంచి తీసుకెళుతున్న క్రమంలో తాము చెప్పినట్లు వినకపోతే చంపి జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని హెచ్చరికలుకు దిగారు. పాస్టర్ కుటుంబంపై జరిగిన దాడిని గమనించిన స్థానికుల సహకారంతో అదే రోజు రాత్రి కొల్లూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లిన బాధితులు, వారి సూచనల మేరకు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో కేసు నమోదులో జాప్యం..!

చెవికి బలమైన గాయం అవడంతో అక్కడే చికిత్స పొందుతూ తెనాలి వైద్యశాల అవుట్‌పోస్టు పోలీసులకు తమపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. ఈనెల 17న తెనాలిలో చేసిన ఫిర్యాదు కొల్లూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క చెవి సక్రమంగా వినిపించని విధంగా దాడి చేసి, ప్రాణాలు తీస్తామని బెదిరింపులకు దిగినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనుక అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లే కారణమన్న అనుమానాలు బాధితులు వ్యక్తం చేస్తున్నారు. తమపై దాడికి పురిగొల్పిన కత్తెర సురేష్ ఈనెల 21న విదేశం వెళ్లనున్న నేపథ్యంలో కేసు నమోదు చేయకుండా పోలీసులు సహకరిస్తున్నారని బాధిత పాస్టర్ జయరాజు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు విషయంలో జాప్యంపై ఎస్‌ఐ జి.ఏడుకొండలను వివరణ కోరగా, దాడికి గురైన పాస్టర్‌ను మంగళవారం కలసి మాట్లాడి వివరాలు తీసుకున్న అనంతరం కేసు నమోదు చేస్తామని బదులిచ్చారు.

బాకీ డబ్బులు అడిగితే చంపుతామంటున్నారు

- అడిషనల్ ఎస్పీ ముందు వాపోయిన వృద్ధురాలు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెల్లువెత్తిన ఫిర్యాదులు
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఏఎస్పీ

బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదుదారులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులు తమగోడును వెల్లబుచ్చుకునేందుకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి క్యూకట్టారు. జిల్లా నలుమూలల నుంచి 36 మంది బాధితులు సోమవారం అడిషనల్ ఎస్పీముందు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. బాధితుల సమస్యలను విన్న అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు.


అడిషనల్ ఎస్పీ వద్ద సమస్యలు విన్నవించుకుంటున్న బాధితులు

హత్యకేసులో అన్యాయంగా ఇరికించారు

నా కుమారుడు సుకుమార్‌ను ఈనెల 6న చీరాలలో జరిగిన హత్యకేసులో అన్యాయంగా ఇరికించారు. హత్య జరిగిన సమయంలో నా కుమారుడు ఊళ్లో కూడా లేడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పేందుకు ఎంత ప్రయత్నించినా మా మాట వినకుండా నా బిడ్డను జైలుపాలు చేశారు.

– అంగడి రజని, పేరాల, చీరాల మండలం

టవర్ ఫ్యాన్ల పేరిట మోసం

నేను గత కొంతకాలంగా ఆన్‌లైన్ బిజినెస్ చేస్తున్నాను. ఆన్‌లైన్‌లో బట్టల వ్యాపారం చేస్తూ అవసరమైన వారికి డోర్ డెలివరీ చేస్తుంటాను. ఇటీవల ఆన్‌లైన్‌లో పరిచయమైన కొందరు వ్యక్తులు టవర్‌ఫ్యాన్లు పంపిస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మి వారు పంపించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి రూ. 20వేలు పంపించాను. తర్వాత ఫోన్ చేస్తే స్పందించడం లేదు.

– ఊటుకూరి వెంకట నిరీషా, చీరాల 1టౌన్

గోడౌన్‌ను కూల్చేశారు

నేను బాపట్ల–సూర్యలంక రోడ్డులో సర్వేనెంబర్ 1010/17లో 2019లో 7.5 సెంట్ల భూమిని కొనుగోలు చేశాను. నా పేరుతో బాపట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2049/2019గా రిజిస్ట్రేషన్ కూడా అయ్యింది. నేను నా స్థలంలో గోడౌన్ నిర్మించుకొని వాటిల్లో టైల్స్‌ను భద్రపరుచుకున్నాను. ఆగస్టు 15 అర్ధరాత్రి సమయంలో నా స్థలంతో ఎలాంటి సంబంధం లేని ఆకుతోట నాగేశ్వరరావు పొక్లెయిన్ సహాయంతో నా గోడౌన్‌ను కూల్చేశారు. ఇదేమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడు.

– అంగలకుదురు రవీంద్రబాబు, బాపట్ల

కేసు పెట్టినా.. డబ్బులు అడిగినా చంపుతానంటున్నాడు



మా పొలాన్ని మా గ్రామానికే చెందిన మహ్మద్ హరీఫ్‌కు గత రెండు సంవత్సరాల క్రితం విక్రయించాను. పొలం కొనుగోలు చేసిన హరీఫ్ పొలం తాలుకా రూ. 10 లక్షలు బకాయి ఉన్నాడు. ప్రతినెల వడ్డీ చెల్లిస్తాను.. ఆరు నెలల్లో రూ.10 లక్షలు ఇస్తానని చెప్పడంతో ఆయన మాటలు నమ్మి పొలాన్ని ఆయన పేరుతో రిజిస్ట్రేషన్ చేశాను. జూన్ వరకు ప్రతినెల వడ్డీ సక్రమంగా చెల్లిస్తూనే వచ్చారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేను వడ్డీ కట్టను. అసలు ఇవ్వను నీకు చేతనైంది చేసుకో... నాపై కేసులు పెట్టినా, డబ్బులు అడిగినా చంపుతానని బెదిరిస్తున్నాడు. నాకు న్యాయం చేయండి.

– షేక్ జహీరున్, చుండూరు మండలం, యడ్లపల్లి

జీజీహెచ్‌లో పటిష్ట భద్రత చర్యలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పక్కా ప్రణాళికతో రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ తెలిపారు. ఆసుపత్రి శుశ్రుత హాలులో సోమవారం పటిష్ట బందోబస్తుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రహరీ గోడకు ఆనుకుని వ్యాపారాలు చేస్తున్న వారి గురించి నగరపాలక సంస్థ కమిషనర్‌తో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు, నగర పాలకసంస్థ అధికారులతో చర్చి ప్రణాళిక ప్రకారం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీని ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళతామని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలాన్ని చీకటి ప్రాంతాల్లో జరుగుతున్నాయని తెలిపారు. నగర పరిధిలో పలుచోట్ల విద్యుత్ సౌకర్యాన్ని, సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల చీకటి వ్యాపారాన్ని అడ్డుకోవచ్చని సూచించారు. ఇలాంటి ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో పర్యవేక్షణ చేస్తున్నారని, అనుమానితులు కనపడితే అదుపులో తీసుకుని విచారిస్తున్నామని చెప్పారు. సదరం సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో వైద్యులకు రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ప్రధాన విభాగల వద్ద కూడా రక్షణ కల్పిస్తామన్నారు. పోలీసు శాఖతో పాటు అన్నీ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. త్వరలో మెడికల్ శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా రాత్రి సమయంలో అసాంఘిక శక్తులు ఆసుపత్రిలో చొరబడుతున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై మరింతగా నిఘా పెంచాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.పవార్ జగన్నాథ్, ఆర్డీఓ శ్రీకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి పాల్గొన్నారు.

ఆగమ శాస్త్రాలలో 'వైఖానస' శ్రేష్టం

టీటీడీ ఆగమ అధ్యాపకుడు ఫణికుమార్

తెనాలి: ఆగమ శాస్త్రాల్లో వైఖానస ఆగమ శాస్త్రం శ్రేష్టమైనదని తిరుమల తిరుపతి దేవస్థానాల శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ధర్మగిరి అధ్యాపకుడు దీవి ఫణికుమార్ అన్నారు. శ్రీ వైఖానస సేవా సంఘం, తెనాలి ఆధ్వర్యంలో విఖనస జయంతి రోజైన సోమవారం పట్టణంలోని గోవర్ధనస్వామి దేవస్థానంలో కొలువైన విఖనసాచార్య స్వామి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన పంచామృత స్నపన, విశేష అర్చన జరిపి బ్రహ్మోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన సభకు సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడూరు శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఫణికుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, నైమిశారణ్యంలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువే విఖనస మహామునిగా ఉద్భవించారని తెలిపారు. ఆయన ప్రధానమైన తొమ్మిది మంది రుషుల ద్వారా ఆగమ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించారని చెప్పారు. వైదిక మార్గంలో భగవంతుని చేరవచ్చు అనేందుకు భగవదర్చన క్రియను కూడా అందించిన మహర్షి విఖనసుడని వివరించారు. సభాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ వైఖానస ఆగమ శాస్త్రాన్ని, విఖనస మహాముని విశిష్టతను దశదిశలా వ్యాపింప చేసేందుకు వైఖానసులు కృషి చేయాలని సూచించారు. సేవాసంఘం నిర్వహిస్తున్న ధార్మిక, సేవలను వివరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు దీవి లక్ష్మీనరసింహాచార్యులు, ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.రఘు, కోశాధికారి యోగానంద చక్రవర్తి, పండిత వీఎల్ఎన్‌డీ భట్టాచార్యులు, నారాయణం రంగాచార్యులు, నారాయణం వేణుగోపాల్, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి, టీటీడీ భజన మండలి కన్వీనర్ రొంపిచర్ల కిరణ్‌కుమార్ మాట్లాడారు. దివి అంజనీకుమార్, వేదాంతం నాగమారుతి వేద పారాయణ చేశారు


ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదుతో ఫణికుమార్‌కు సత్కారం

ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదు ప్రదానం

సేవాసంఘం ఆధ్వర్యంలో పండిత దీవి ఫణికుమార్ కు ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని అగ్నిహోత్రం సనత్ కుమార్, అగ్నిహోత్రం శ్రీనివాస దీక్షితులు, రొంపిచర్ల శేషసాయి పర్యవేక్షించారు. రొంపిచర్ల లక్ష్మీనరసింహాచార్యులు, రాజ్యలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు అగ్నిహోత్రం నరసింహమూర్తిని అర్చక పురస్కారంతో సన్మానించారు. ఆగమ విద్యార్థులు నారాయణం సంతోష్, వేదాంతం కమలేష్‌కు ఆగమ విద్యార్థి పురస్కారాన్ని అందించారు. నారాయణం రంగాచార్యులు పర్యవేక్షణలో ఆచార్య స్వామి రథోత్సవం నిర్వహించారు.

హకీం జానీకి యువకళా వాహిని పురస్కారం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజానికి ప్రతిష్టాత్మకమైన యువకళా వాహిని పురస్కారం లభించింది. రచయిత విభాగంలో అమరావతి తెలుగు వెలుగులు పేరుతో ఈ నెల 23న గుంటూరులో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు ఈ మేరకు సమాచారం పంపారు. బృందావన్ గార్డెన్స్‌లోని అన్న మయ్య కళావేదికపై జరిగే కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నారు.

ప్రకాశం జట్టుపై గుంటూరు ఘనవిజయం

- 10 వికెట్ల తేడాతో గుంటూరు విజయం
- గుంటూరు జట్టుకు ఏడు పాయింట్లు


సిద్ధూ, 4 వికెట్లు, గుంటూరు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టుపై గుంటూరు జట్టు ఘన విజయం సాధించింది. మూడు రోజులపాటు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి 10 వికెట్ల తేడాతో ప్రకాశం జట్టును చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు కట్టడి చేసిన గుంటూరు జట్టు 390 సాధించి 115 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ప్రకాశం జట్టు ఆదివారం నాటి రెండు వికెట్లు నష్టానికి 44 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం బ్యాటింగ్ ప్రారంభించి రెండో ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని పి.నందకిషోర్ 49 పరుగులు సాధించి పరుగు తేడాతో అర్ధ సెంచరీ మిస్ అయ్యాడు. గుంటూరు బౌలర్ సిద్ధూ 15 ఓవర్లలో 53 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, వీపీఎస్ రెడ్డి 13 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 80 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు 15.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. గుంటూరు బ్యాట్స్‌మెన్‌లు కె.ఎల్.శ్రీనివాస్ 44, రోనే 36 పరుగులు సాధించారు. భారీ విజయం సాధించిన గుంటూరు జట్టుకు ఏడు పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీ తాపతిరావు పర్యవేక్షించారు.

టీకాలు సద్వినియోగం చేసుకోండి

- పోస్టర్లు, టీకాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- ఈనెల 20 నుంచి సెప్టెంబరు 18వరకు కార్యక్రమం
- రైతుల ఇళ్ల వద్దకే వచ్చి పశువులకు టీకాలు వినియోగం

నరసరావుపేట: జిల్లాలో పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి, బ్రోసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను రైతు పశుపోషకులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రెండు వ్యాధుల నిరోధక టీకాల కార్యక్రమాలకు చెందిన పోస్టర్లు కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆరు నెలలు నిండిన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, నాలుగు నుంచి ఎనిమిది నెలలవయస్సు ఉన్న పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను రైతుల ఇళ్లవద్దకే వచ్చి ఉచితంగా వేస్తారన్నారు. జిల్లాలో 4.36లక్షలు గాలికుంటు వ్యాధి టీకాలు, 38,500 బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు అందుబాటులో ఉంచినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కంచర్ల కాంతారావు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ, డీఆర్వో కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, పశు సంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

డెల్టాకు 8,000 క్యూసెక్కులు సరఫరా చేయాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు రైతుసంఘం వినతి


వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నేతలు

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాకు 8,000 క్యూసెక్కులు సరఫరా చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, తెనాలి డివిజన్ కమిటీ సోమవారం సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ కు వినతిపత్రం అందజేసింది. పెదవడ్లపూడి హైలెవెల్ చానల్‌కు రూ.3 కోట్లను కేటాయించడంతో పాటు 25 వేల ఎకరాల్లోని పంటలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు అయితానగర్ మహిళా పాడి రైతులకు ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించాలని, పశుగ్రాసం కొనుగోలు నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ హామీనిచ్చారు. 2023–24 సంవత్సరంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీని ఇప్పించాలని కోరారు. కొల్లిపర మండలం వల్లభాపురంలోని జాయింట్ లైబిలిటీ మహి గ్రూపుకి రూ.5 లక్షలకు మరొక రూ.50 వేల రుణ సదుపాయం కల్పించి ఆ గ్రూపుకి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరినట్టు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. మహిళా పాడి రైతు సంఘం నాయకురాలు వేజెండ్ల తబిత మాట్లాడుతూ పశుపోషణ భారంగా మారినందున ప్రభుత్వరంగ సంస్థలు రైతులకు రుణాలు మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో మాన్యం శ్యాంబాబు, మేకల అనసూయ, ఈపూరి బేబీ రాణి మేకల ధనమ్మ, గొరికపూడి అరుణ, సునీత, తెనాలి నిర్మల, పద్మ, కూచిపూడి శకుంతల, తోట సరోజిని, వేజెండ్ల వజ్రమ్మ, తెనాలి ఝాన్సీ పాల్గొన్నారు.

సముద్రంలో మునిగి మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన గజ ఈతగాళ్లు, మెరైన్ సిబ్బంది


ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన గజ ఈతగాళ్లు, పోలీసులు

బాపట్లటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన చందోలు లక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో ఉదయం సూర్యలంక సముద్రతీరానికి చేరుకొని మధ్యాహ్నం సమయంలో సముద్రంలో లోతుకు వెళ్లి మునిగి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. పోలీసులు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా హెచ్చరిస్తున్నప్పటికీ సముద్రంలో ఇంకా లోతుకు వెళుతూ మునిగిపోసాగింది. ఈ విషయాన్ని గమనించిన గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై వెంటనే సముద్రంలోకి వెళ్లి మహిళను కాపాడి తీరానికి తీసుకువచ్చారు. అనంతరం రూరల్ సీఐ గంగాధరరావు మహిళకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. మహిళను కాపాడిన సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు.

కోల్‌కతా ఘటనలో నిందితులను అరెస్ట్ చేయాలి

సత్తెనపల్లి: కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్యశాలలో మెడిసిన్ పీజీ విద్యార్థిని మౌమితపై లైంగికదాడి చేసి అనంతరం హత్య చేసిన నేరస్తులను అరెస్ట్ చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చిన రామిరెడ్డి డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం పల్నాడు జిల్లా శాఖ, సత్తెనపల్లి తాలూకా యూనిట్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిన రామిరెడ్డి మాట్లా డుతూ ఇటువంటి సంఘటన మానవత్వానికి మాయని మచ్చ అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి నిందితులను రాజకీయాలు, పార్టీలతో ప్రమేయం లేకుండా అరెస్టు చేసి కఠినంగా శిక్ష విధించాలన్నారు. రాత్రి వేళల్లో మహిళలకు డ్యూటీలు వేయరాదని, పనిగంటలు ఎనిమిది గంటల వరకు మాత్రమే నియంత్రించాలని, మహిళా ఉద్యోగులు ఉన్నచోట వారికి మీటింగ్ రూమ్స్, టాయిలెట్స్, కరెంటు లైటింగ్ ఫెసిలిటీ తప్పనిసరిగా ఉండాలని, నైట్ డ్యూటీ చేసే వారికి రాత్రి వేళల్లో 12 గంటల నుండి తెల్లవారుజామున 5 గంటల వరకు మహిళా పోలీసుల విజిటింగ్ తప్పనిసరిగా ఉండాలని, ఉన్నతాధికారులు ప్రభుత్వ హాస్పిటల్స్‌ను, కార్యాలయాలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆర్డీవో మురళీకృష్ణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ బసవ కుమారి, నరసరావుపేట తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్, లక్ష్మీజ్యోతి, చలమారెడ్డి, ఉపాధ్యక్షులు సీహెచ్ ఆనంద్‌కుమార్, ట్రెజరర్ పీటర్ డామియన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య

విజయపురిసౌత్: పెట్రోల్ పోసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయపురిసౌత్‌లోని కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ పక్కన ఉన్న పాత లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ ఆవరణలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి ఆదివారం రాత్రి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు సాగర్ మాత గుడి వద్ద అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో పలువురికి కనిపించినట్లు తెలిసింది. మృతదేహం వద్ద ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లో కాషాయ రంగు టవల్, రెండు వాటర్ బాటిల్స్, రెండు బీడీ కట్టలు, ఒక అగ్గిపెట్టె ఉన్నాయి. మృతుడు యాచకుడని పోలీసులు భావిస్తున్నారు. గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ గురనాథ్‌బాబు, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభిరామయ్య ఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభిరామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.